సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రాజేందర్‌రెడ్డి

అర్హులకే 'రైతుభరోసా' ఇవ్వాలి

- పది ఎకరాలలోపు వారికి పంట సాయం అందించాలి
- అవగాహన సదస్సులో రైతులు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 2 : పంట పెట్టుబడి సాయం పది ఎకరాలలోపు రైతులకే అందించాలని పలువురు ప్రభుత్వానికి సూచించారు. రైతుభరోసా పథకంపై మంగళవారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు రైతులు మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు దూదిపాల నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా డీసీవో వై రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటలు సాగు చేస్తున్న రైతులకే రైతుభరోసా పథకం అమలు చేయాలని కోరారు. సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాలని వారు సూచించారు. మార్కెట్లో కల్తీ విత్తనాలను నివారించాలని, పంటలకు బోనస్ అందించి ఆదుకోవాలని వారు కోరారు.

రైతుల అభిప్రాయాలను సర్కారుకు పంపుతాం : డీసీవో

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుభరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు తీసుకుని సర్కారుకు నివేదిక పంపుతామని డీసీవో రాజేందర్‌రెడ్డి అన్నారు. నెలాఖరులోగా సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏవో చంద్రన్‌కుమార్, సొసైటీ వైస్‌చైర్మన్ చిర్ర నాగరాజు, సీఈవో మగ్దుం అలీ, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, చింత ఎల్లయ్య, తోట సత్యం, చట్ల యాకయ్య, మారపల్లి కిషన్‌రెడ్డి, గుగులోత్ ఉమ్లానాయక్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గడ్ : పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే రైతుభరోసా పథకం అమలు చేయాలని ఎంపీపీ రడపాక సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి రైతులతో కలిసి వారు హాజరయ్యారు. రైతుబీమా పరిమితిని 59 నుంచి 70 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రాజేందర్‌రెడ్డి, ఏవో చంద్రన్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్లు సాంబరాజు, యాకయ్య, గడ్డం రాజు, నాగరాజు పాల్గొన్నారు.

ఆక్రమణదారులు వెంటనే ఖాళీ చేయాలి

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో చేరిన వారికి తహసీల్దార్ ఆదేశం

డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

దేవరుప్పుల, జూలై 2: మండల కేంద్రంలోని జర్నలిస్ట్ కాలనీతో పాటు, కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అనధికారికంగా ఉంటున్న వారు వెంటనే ఖాళీ చేయాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో చొరబాట్లపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అదనపు కలెక్టర్‌కు సమాచారం అందించి ఖాళీ చేయించాలని కోరారు. దీంతో మంగళవారం తహసీల్దార్ హుస్సేన్‌తో పాటు జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి దామోదర్ రావు, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి జర్నలిస్ట్ కాలనీలో అక్రమంగా ఉంటున్న వారితో మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇండ్లను ఆక్రమించుకోవడం నేరమని, వెంటనే ఖాళీ చేయాలని కోరారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మరోచోట అక్రమంగా ఉంటున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, దేవరుప్పుల, పాలకుర్తి ఎస్సైలు చెన్నకేశవులు, ప్రసన్నకుమార్, ఏఎస్సై సదానందం, ఐబీ ఏఈ విద్యాసాగర్, ఆర్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీ : నలుగురికి గాయాలు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 2 : మండలంలోని రాఘవాపూర్ హైవేపై మంగళవారం ఆటోను కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లి మండలం మల్లంపల్లికి చెందిన గుర్రం సుధాకర్, కనకటి రమేశ్, తాళ్లపల్లి సల్మాన్, అలుగోజు రాములు స్టేషన్ ఘన్‌పూర్ వైపు ఆటోలో వస్తుండగా రాఘవాపూర్ శివారులో కారు ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడడంతో నలుగురికి గాయపడ్డారు. బాధితులను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో అలుగోజు రాములును వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు పంపినట్లు స్థానికులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, the undersigned **ARABUNNISA HUSAIN, W/o. MOHAMMED KHAJA PASHA,** of my name as **ARAB UNNISA** have Changed my name to **ARABUNNISA HUSAIN,** R/o. H.No. 14-7-124, Opp: Zam Zam Masjid, Nizampura, Warangal, T.S.-506002, India.
NTW-00

CHANGE OF NAME

I, **AMEENA BEGUM, D/o. MD. THAJUDDIN,** R/o. H.No. 3-9-163, Reddy Colony, Hanamkonda. From know on wards, I will be called as **AMINA FIRDOUS, D/o. MD. THAJUDDIN,** Hanamkonda.

CHANGE OF NAME

I, **REENA BEGUM, D/o. MD. THAJUDDIN,** R/o. H.No. 3-9-163, Reddy Colony, Hanamkonda. From know on wards, I will be called as **ANISA FATIMA, D/o. MD. THAJUDDIN,** Hanamkonda.

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325755

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

రూ.4155.88 కోట్లతో రుణ ప్రణాళిక

- ఆవిష్కరించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా
- ప్రభుత్వం గుర్తించిన యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశం

జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ, జూలై 2 (నమస్తే తెలంగాణ) : 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.4155.88 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆమోదించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించారు. బ్యాంకులు నిరుపేదలకు రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వం గుర్తించిన యూనిట్లకు ప్రాధాన్యత ఇచ్చి నిర్దేశించిన ప్రగతి సాధించాలని బ్యాంకర్లకు ఆయన సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ సమావేశంతో పాటు జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రుణ ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లక్ష్యాలు సాధించేందుకు బ్యాంకు అధికారులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక రుణప్రగతి లక్ష్యాలను సాధించేందుకు తగిన వనరులు ఉన్నాయని తెలిపారు. నిరుపేదల ఆర్థిక ప్రగతికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వం గుర్తించిన యూనిట్స్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. గత వార్షిక రుణ ప్రణాళికలో రూ.3102.76 కోట్లు కాగా అందులో రూ.2979.83 కోట్లు మంజూరు చేసి 96.04 శాతం సాధించామన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో ఆక్వా కల్చర్ చేపట్టామని తెలిపారు. అధికారులు లబ్ధిదారులును గుర్తించాలని, తక్కువ ఖర్చుతో చేపల పెంపకం లాభదాయకంగా ఉంటుందన్నారు. ఆరు వేల పాడి పరిశ్రమ యూనిట్లు తో పాటు 1200 పౌల్ట్రీ యూనిట్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి సంఘాలకు 6990 మైక్రో రుణాలను మంజూరు చేసేందుకు జిల్లా అధికారులతో బ్యాంకు అధికారులు కలిసి గ్రామ పంచాయతీ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహిస్తూ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, రిజర్వ్ బ్యాంక్ మేనేజర్ పల్లవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మొగులప్ప, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ , జిల్లా పరిశ్రమల అధికారి రమేశ్, పశుసంవర్ధక శాఖ అధికారి మనోహర్‌తదితరులు పాల్గొన్నారు.

బీరప్పగడ్డలో తాళం వేసిన ఇంట్లో చోరీ

జనగామ, జూలై 02 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని బీరప్పగడ్డలోని ఓ ఇంటిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీరప్పగడ్డకు చెందిన గుంటి ప్రేమలత కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, ఆమె ఇక్కడ నివాసముంటున్నారు. కొంత కాలం క్రితం పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన సుమారు 11 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 25 తులాల వెండిని విడిపించుకుని ఇంట్లో దాచారు. అనారోగ్యంతో ప్రైవేట్ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు గత నెల 25న హైదరాబాద్‌లోని తన కుమారుడు సాయి రాఘవ వద్దకు వెళ్లింది. సోమవారం అర్ధరాత్రి ప్రేమలత ఇంటి పక్కనే ఉన్న తన భర్త అన్నదమ్ముల ఇంటి డోర్లకు బయట నుంచి బేడాలు వేసి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ప్రేమలత ఇంట్లో సుమారు రూ.10 లక్షల విలువైన 11 తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఎస్సై భరత్ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి వెళ్లిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. సీఐ రఘుపతిరెడ్డితో కలిసి డీసీపీ రాజమహేంద్రనాయక్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీలో లక్కీ డిప్ విజేతలకు బహుమతులు

విజేతలకు బహుమతులు ఇస్తున్న డీఎం జ్యోత్స్న

జనగామ, జూలై 2 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ జనగామ డిపో డీలక్స్ బస్సుల్లో గత నెల 20 నుంచి 30వ తేదీ వరకు ప్రయాణించిన ముగ్గురు మహిళా ప్రయాణికులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. వీరికి మంగళవారం డీఎం జ్యోత్స్న బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి నీలం లక్ష్మి(జనగామ), ద్వితీయ బహుమతి జే రోజా(వరంగల్), తృతీయ బహుమతి జీ వైష్ణవి(మణికొండ)కు లభించాయి. 30 సెప్టెంబర్ 2024 వరకు ప్రతి పదిహేను రోజులకు ఒక సారి డ్రా తీసి విజేతలకు విలువైన బహుమతులు అందజేస్తామని జ్యోత్స్న తెలిపారు.

దేవరుప్పల వంతెనపై ప్రమాదం

బైక్‌ను ఢీకొని పడిపోయిన కారు

ప్రమాదానికి గురైన కారు

దేవరుప్పుల, జూలై 2: మండల కేంద్రంలోని హైలెవల్ వంతెనపై మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రమాదం జరిగింది. బస్టాండ్ నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తిని వెనక నుంచి వస్తున్న కారు ఢీకొంది. సడన్‌గా బ్రేక్ వేయడంతో కారు వంతెనపై నుంచి కింద పడి పల్టీలు కొట్టింది. బైక్ ధ్వంసం కాగా దీనిపై వెళ్తున్న మండల కేంద్రానికి చెందిన కారుపోతుల యాదగిరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జవగా బెలూన్లు పేలిపోయాయి. ఇంత జరిగినా కారులో వెళ్తున్న వారు కనిపించకపోవడం గమనార్హం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వీఎన్ చారికి డాక్టరేట్

దేవరుప్పుల, జూలై 2: మండల కేంద్రానికి చెందిన చిలుమోజు వెంకట నర్సింహాచారికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో చారి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఉస్మానియాలో ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ మైక్రో స్మాల్ అండ్ మీడియం స్కేల్ ఇండస్ట్రీస్ పర్‌ఫార్మెన్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణకుమార్ నేతృత్వంలో పరిశోధన చేశారు. చారికి డాక్టరేట్ రావడంపై స్థానికులతో పాటు విద్యావేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్

దేవరుప్పుల, జూలై 2: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగోని సుమ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మ భిక్షం, సహాయకార్యదర్శి యాకన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ యూసఫ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

రఘునాథపల్లి, జూలై 2: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన రఘునాథపల్లి- ఇప్పగూడెం రైల్వేస్టేషన్ మధ్య గల గోవర్ధనగిరి సమీపంలో మంగళవారం వెలుగు చూసింది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఏపీలోని విజయవాడ సమీపంలోని పున్నమితోట గ్రామానికి చెందిన రెడ్డి నాగేశ్వర్‌రావు (55) రైలులో వస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. డ్రైవింగ్ లైస్సెన్స్ ఆధారంగా వివరాలు గుర్తించినట్లు వారు తెలిపారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల కమిటీ ఎన్నిక

రాంబాబు, రాజు

పాలకుర్తి, జూలై 2 : ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో నిర్వహించిన సంఘం సమావేశానికి యూనియన్ నాయకులు హాజరయ్యారు. అనంతరం మండల గౌరవాధ్యక్షుడిగా ఎడవెల్లి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా రాపోలు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా గుడికందుల నరేశ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి రాజు, సహాయ కార్యదర్శిగా చిన్నబోయిన అశోక్, కోశాధికారిగా చిలుమల బాబు, కార్యవర్గ సభ్యులుగా రమణ, సుధాకర్, పున్నతల స్వామి, ఇల్లందుల అశోక్, ఎలిగిటి సోమన్న, కొత్తూరి మధును ఎన్నుకున్నారు. రాపోలు లక్ష్మణ్, జీడి సంజయ్, ప్రదీప్, శ్రీనివాస్ మహేశ్, సంతోష్, మహేందర్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

బచ్చన్నపేట, జూలై 2 : ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులను సత్కరించనున్నట్లు ఎంపీడీవో రఘురామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీటీసీల ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్నందున ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు వీడ్కోలు పలికేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు హాజరై అభివృద్ధి పనులు వివరించడంతోపాటు ప్రజాప్రతినిధులను సత్కరిస్తారని ఆయన తెలిపారు. సమావేశానికి ఎంపీపీ బావండ్ల నాగజ్యోతీకృష్ణంరాజు అధ్యక్షత వహిస్తారని, మండలంలోని ఎంపీటీసీలు హాజరు కావాలని రఘురామకృష్ణ కోరారు.

ఇంగ్లిష్ టీచర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట, జూలై 2 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో ఇంగ్లిష్ బోధించేందుకు గంటల ప్రాతిపాదికన టీచర్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ, బీఈడీ అర్హత కలిగిన వారు ఈ నెల 5న పాఠశాలకు వచ్చి డెమోలో పాల్గొనాలని సూచించారు.

తలనీలాలు, లడ్డూ, పులిహోరకు వేలం

బచ్చన్నపేట, జూలై 2 : మండలంలోని కొడవటూరు శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఈవో చిందం వంశీ నేతృత్వంలో కొనసాగించారు. తలనీలాల వేలాన్ని కొడవటూరుకు చెందిన నడిగొట్టు సురేశ్ రూ.2.32 లక్షలకు దక్కించుకున్నారు. లడ్డు, పులిహోరకుగాను వరంగల్‌కు చెందిన ప్రవీణ్ రూ.2.75 లక్షలకు పాట దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓనమఃశివాయ, అర్చకులు సదాశివుడు, మహాశివుడు, సంగమేశ్వర్, సిబ్బంది చల్లా రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొడకండ్ల, జూలై 2 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కారోబార్ నాగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నాగయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు మందుల మల్లేశ్, తండ అంజి, ముస్కు మల్లారెడ్డి, మేటి నర్సింహస్వామి, కొడగాని నవీన్, బొమ్మగాని సోమయ్య, గూడెల్లి కొమురయ్య, బొమ్మగాని వెంకన్న, ఎడెల్లి రణధీర్, కర్నెకంటి శ్రీను, నక్క అశోక్, మైనాల సునీల్, పాక ప్రవీణ్, బెంబరి పూర్ణచందర్ ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలి

- చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి
- పాఠశాలల తనిఖీలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా

మల్కాపూర్ పీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బందితో కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

చిల్పూరు, జూలై 2 : క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు లక్ష్యాన్ని సాధించాలని, చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజవరం శివారులోని కేజీబీవీ, మల్కాపూర్‌లోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆమ్మ ఆదర్శ పాఠశాల పనులను, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు బాగా చదుకుని 10/10 జీపీఏ సాధించాలని కోరారు. తద్వారా పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయుల బోధనను పర్యవేక్షించారు. రాజవరం శివారులోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని షేక్ రిజ్వాన్‌బాషా తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అభివృద్ధి పనులతోపాటు ప్రహరీని త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ, ఇతర అధికారులను పర్యవేక్షించాలన్నారు.

రాజవరంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పాఠశాలల్లో మౌలిక వసతులకు చర్యలు..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేలా సర్కారు చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా అన్నారు. ఇందుకోసం నిధులు విడుదల చేశామన్నారు. అనంతరం మల్కాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారితో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుక్క, పాము కాటుకు నివారణ మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆయన కోరారు. ప్రభు త్వ దవాఖానల్లో ప్రసవాలు పెంచే లా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మల్కాపూర్‌లో స్టాఫ్ నర్సు లేనందున వెంటనే డిప్యుటేషన్‌పై ఒకరిని పంపాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, మండల వైద్యాధికారిని కుషాలి, పీఆర్ ఏఈ నరేశ్, నాయకులు పోలెపల్లి రంజిత్‌రెడ్డి, ఎంపీటీసీ ఉమాసమ్మయ్య, నాయకులు యాదగిరి, రవి, యాదగిరి, మండల సూపర్‌వైజర్లు విజయ, మంజుల, రాణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ అనిత

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జనగామ, జూలై 2 (నమస్తే తెలంగాణ) : జనగామ పట్టణం 17వ వార్డు పరిధిలోని జూబ్లీ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు మంగళవారం వార్డు కౌన్సిలర్ జక్కుల అనితా వేణుమాధవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం వీధుల్లో రహదారుల సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

బచ్చన్నపేట, జూలై 2 : మండల కేంద్రంలో ఆదివారం జరిగే సంతలో మరుగుదొడ్ల నిర్మాణానికి అధికారులు స్థలం పరిశీలించారు. జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో అనిల్‌కుమార్, మండల అధికారులు మంగళవారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ సంతకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఎక్కడ మూత్రశాలలు నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందనే విషయమై స్థలాలను పరిశీలించామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, సిబ్బంది చక్రధర్, ఆశోక్, వివిధ పార్టీల నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, ఆల్వాల ఎల్లయ్య, దిడ్డిగ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిల్పూరు, జూలై 2 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలో జరిగింది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన కన్నె శివలింగం మంగళవారం తల్లి మల్లమ్మ(60)తో కలిసి బైక్‌పై ఐనవోలులోని మల్లన్న ఆలయాన్ని దర్శించుకుని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో చిన్నపెండ్యాల శివారులోని బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొనడంతో కన్నె మల్లమ్మ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. శివలింగంను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడి ఆత్మహత్య

జనగామ, జూలై 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉల్లెంగుల కృష్ణ (49) అనారోగ్యంతో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రత్యేక రాష్ట్ర, జిల్లా సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కృష్ణ సతీమణి కరోనా సమయంలో మృతి చెందింది. నాటి నుంచి మనోవేదనతో అనారోగ్యానికి గురైన ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణ పార్థివ దేహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, కౌన్సిలర్ బండ పద్మ యాదగిరిరెడ్డి, నాయకులు మల్లిగారి రాజు, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, వంగ ప్రణీత్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన బీఆర్ఎస్ నాయకులు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.